
సాక్షి
ఒడిశా

శనివారం । 10 । మే । 2025



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 6.74.982
బంగారం: 2 గ్రాములు
వెండి: 33 గ్రాముల 500 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



సరస్వతీ పుష్కరాలపై నీలినీడలు!

భారత్ – పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో సరస్వతీ పుష్కరాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. అక్కడి వెళ్లే ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

-12లో



అట్టడుగు వర్గాలకు సౌకర్యాలు

అట్టడుగున ఉన్న ప్రజలకు అన్ని ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు.

-12లో

న్యూస్‌రీల్

రక్తపు మడుగులో మృతదేహం


మంటల్లో దగ్ధమైన కారు

భువనేశ్వర్: పొదల చాటున రక్తం మడుగుల్లో ఓ యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన బారంగ్ ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం పూరీ కాలువ రోడ్డు పరిసరాల్లో కాలిపోతున్న వాహనాన్ని స్థానికులు గమనించి, గొడి సాహి పోలీస్ అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న వారు మృతదేహం దగ్గర ఒక కర్ర చెక్క పడి ఉండటాన్ని గుర్తించారు. గురువారం అర్ధ రాత్రి గుర్తు తెలియని దుండగులు యువకుడిని కర్ర చెక్కతో కొట్టి చంపి ఉంటారని అనుమానిస్తున్నారు. అనంతరం అతని వాహనాన్ని తగలబెట్టి, మృతదేహం పొదల్లో పడేసి పరారీ అయినట్లు భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలియాల్సి ఉందన్నారు.

మంచాగాం గ్రామ సర్పంచ్ మృతి

• కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి


సదాశివ శాంత (ఫైల్)

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా తెంతులకుంటి సమితి మంచాగాం పంచాయతీ గ్రామ సర్పంచ్ సదాశివ శాంత (45) అనారోగ్యంతో జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నబరంగ్‌పూర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి హుటాహుటీన ఆస్పత్రికి చేరుకున్నారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహం తరలింపు, అంత్యక్రియల ఏర్పాట్లకు సహకరించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

కొరాపుట్: బైకులను చోరీ చేస్తున్న దొంగను నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌డీపీవో కార్యాలయం వద్ద ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులు వెల్లడించారు. జిల్లాలోని పపడాహండి సమితి దిసారి గుడ గ్రామానికి చెందిన లబో భోత్ర వాహనాలను చోరీ చేస్తున్నట్టు గుర్తించారు. దీంతో అతని ఇంటిపై నిఘా వేయగా హీరో హోండా ప్యాషన్ ప్లస్, హీరో హోండా స్పెండర్‌ప్లస్ బైకులు పట్టుబడ్డాయన్నారు. దీంతో అతన్ని విచారించగా తానే దొంగతనం చేసినట్లు అంగీకరించడంతో అరెస్టు చేసి కోర్టుకు తరలించామన్నారు.

ఘనంగా త్రివర్ణ పతాక యాత్ర


నగర వీధుల్లో జై హింద్ యాత్ర

భువనేశ్వర్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పిలుపు మేరకు భువనేశ్వర్ నగరంలో జై హింద్‌ను యాత్ర శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ ఆధ్వర్యంలో స్థానిక రామ్ మందిర్ కూడలి నుంచి మాస్టర్ కాటిన్ చౌరస్తా వరకు యాత్ర సాగింది. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని అణచి వేయడానికి పరాక్రమం, అపరిమిత ధైర్యం, అపారమైన శక్తిని ప్రదర్శించిన భారత సైనికుల గౌరవార్థం త్రివర్ణ పతాక యాత్రను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళానికి కార్యకర్తలు గౌరవ వందనం సమర్పించారు. యాత్ర పురస్కరించుకుని జై హింద్, జై జవాన్ నినాదాలతో పరిసరాలు మారుమోగాయి. ఈ యాత్రలో దేశ భక్తి సంగీతాన్ని ఆలాపించారు.


వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు


పోలీసు బందోబస్తు

శ్రీ మందిరానికి.. పటిష్ట భద్రత


పూరీ జగన్నాథ ఆలయం పరిసరాల్లో భద్రతపై పోలీసు సిబ్బందికి వివరిస్తున్న ఉన్నతాధికారులు

• నలువైపులా సాయుధ దళాల మోహరింపు
• ముమ్మరంగా తనిఖీలు

భువనేశ్వర్: భారత్, పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో పూరీ జగన్నాథ ఆలయం వద్ద భద్రత పటిష్ట పరిచారు. శ్రీమందిరం నలువైపులా భద్రత స్థాయి పెంచారు. తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రధాన రహదారి బొడొదండొ దారి పొడవునా భద్రత దళాలను మోహరించారు. గురువారం రాత్రి నుంచి సాయుధ భద్రతా దళాలతో భద్రత పెంచారు. పూరీ జిల్లా పోలీసులు వివిధ ప్రదేశాలలో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. పట్టణ ప్రధాన ప్రవేశమార్గాల్లో కదలికల పట్ల భద్రతా యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించింది. పూరీ పోలీసులు ప్రత్యేకంగా ఎలాంటి ఉగ్రవాద దాడి జరగకుండా సన్నాహాలు చేస్తున్నట్లు అధికార వర్గాల సమాచారం. వివిధ హోటళ్లను తనిఖీ చేస్తున్నారు.

ముఖ్యమంత్రి సందేశం..

రాష్ట్రంలో సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రత పెంచినట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. బాలాసోర్ జిల్లా చాందీపూర్ క్షిపణి ప్రయోగ క్షేత్రం, శ్రీ జగన్నాథుని క్షేత్రం పూరీ ప్రాంతానికి ఎటువంటి ముప్పు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జమ్మూలోని ఒడియా ప్రజల్ని తిరిగి తీసుకువస్తామన్నారు. భారత్, పాక్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో భద్రతా వ్యవస్థని సమీక్షించారు. ఈ సందర్భంగా భారత్, పాకిస్తాన్ ఉద్రిక్తతల పరిస్థితిపై కేంద్ర హోం శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రముఖ కార్యదర్శులు, నిర్వాహకులకు లేఖ రాసిందని పేర్కొన్నారు. యుద్ధం లాంటి పరిస్థితి ఏర్పడినప్పుడు అవసరమైన ముందు జాగ్రత్త చర్యలను సమర్థవంతంగా అమలు చేయడానికి పౌర రక్షణ (సివిల్ డిఫెన్సు) నియమాల ప్రకారం అత్యవసర అధికారాలను ప్రయోగించాలని హోం శాఖ రాసిన లేఖలో వివరించినట్లు తెలిపారు.


శ్రీ మందిరం పరిసరాల్లో కేంద్ర భద్రతా దళాల తనిఖీలు

'హీరాకుడ్' పర్యాటకులకు ఆంక్షలు



హీరాకుడ్ ఆనకట్ట

భువనేశ్వర్: పశ్చిమ ఒడిశా సంబలపూర్ హిరాకుడ్ ఆనకట్ట వద్ద భద్రతా ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఈ మేరకు శుక్రవారం నుంచి చర్యలు చేపట్టారు. తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు ఆనకట్ట ప్రాంగణంలోకి పర్యాటకుల ప్రవేశాన్ని పరిమితం చేసినట్లు ప్రకటించారు. ఈ మేరకు కీలకమైన ప్రవేశ కేంద్రాల వద్ద నోటీసులు జారీ చేశారు. ఉత్తర్వుల అమలుకు ఆయా కేంద్రాల్లో పోలీసు సిబ్బందిని మోహరించారు. సంబలపూర్ జిల్లా యంత్రాంగం, రాష్ట్ర కేంద్ర భద్రతా సంస్థల సమన్వయంతో ఉన్నత స్థాయి భద్రతా ప్రోటోకాల్‌ను ప్రారంభించింది. విపత్కర పరిస్థితుల్లో వేగవంతమైన ప్రతిస్పందన కోసం లైట్ మెషిన్ గన్ (ఎల్ఎంజీలు) సహా ఆధునిక సాయుధ దళాలను మోహరించారు. ఆసియాలోనే అతి పొడవైన మట్టి ఆనకట్ట, భారీ నీటి పారుదల, విద్యుత్ ఉత్పత్తి , వరద నియంత్రణకు కీలకమైన నీటి నిల్వ అయిన హిరాకుడ్ ఆనకట్టపై ఆగంతకుల దృష్టి కేంద్రీకృతమై ఉండే అవకాశం నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా సందర్శకులను పరిమితం చేస్తున్నారు.

విమానాశ్రయంలో బ్యాగ్ కలకలం

భువనేశ్వర్: స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో మహిళా ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగ్ తీవ్ర కలకలం రేపింది. విమానయాన ప్రయాణికులతో పాటు అధికారులు, భద్రతా దళాలను సైతం పరుగులు తీయించింది. శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. భారత్, పాక్ యుద్ధ పరిస్థితుల దృష్ట్యా దేశంలోని అన్ని విమానాశ్రయాలకు హై అలర్ట్ జారీ చేశారు. ఈ క్రమంలో స్థానిక విమానాశ్రయంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇంతలో విమానాశ్రయం ప్రాంగణంలో అనుమానాస్పద బ్యాగ్ ప్రయాణికుల దృష్టికి వచ్చింది. వెంటనే భద్రతా అనుబంధ వర్గాల దృష్టికి చేరింది. లగేజీ ట్రాలీలో బ్యాగ్ ఉన్నట్లు గుర్తించి నిఘా జాగిలం (స్నిఫర్ డాగ్), బాంబ్ స్క్వాడ్ బృందాల్ని రంగంలోకి దించారు. అనంతరం పోలీసులు అనుమానాస్పద బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణ చేయగా బ్యాగు హైదరాబాద్ నుంచి భువనేశ్వర్ వచ్చిన మహిళా ప్రయాణికురాలిదిగా తేలింది. ఆమె విమానాశ్రయానికి తిరిగి వచ్చి తన సామాను కోసం వెతకడంతో గందరగోళం వీడింది. అందులో కొన్ని డైపర్లు, మొబైల్ ఛార్జర్ ఉన్నాయి. అనంతరం బ్యాగ్‌ను మహిళకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.


జాగిలంతో తనిఖీ చేపడుతున్న భద్రతా సిబ్బంది


విమానాశ్రయంలో కలకలం రేపిన బ్యాగు

గురండి ఆదర్శ రైతుకు కిసాన్ అవార్డు ప్రదానం

పర్లాకిమిడి: కేంద్ర ఆగ్రోఫారెస్ట్రీ పరిశోధన సంస్థ (కాఫ్రీ) ఝాన్సీ (ఉత్తర్ ప్రదేశ్) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గజపతి జిల్లా గురండి గ్రామానికి చెందిన ఆదర్శ రైతు సంజయ్ జెన్నాకు కృషి వంశికి కిసాన్ అవార్డు–2024' ఢిల్లీలో డైరెక్టర్ డాక్టర్ అరుణాచలం (కాఫ్రీ) గురువారం అందజేశారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్) అనుబంధ సంస్థగా ఉన్న కేంద్ర ఆగ్రో ఫారెస్ట్రీ పరిశోధన సంస్థ, ఆదర్శ జెన్నా తన స్వగ్రామం గురండిలో కొద్దిపాటి వ్యవసాయ క్షేత్రంలో రసాయన ఎరువులు ఉపయోగించకుండా పంటలు పండించారు. అటవీ మొక్కలు, పశువులు, చేపల పెంపకం, వనాలు పెంచుతూ బయా డెవర్సిటీ డెవలప్‌మెంట్‌కు కృషి చేస్తున్నందుకు ఆయనకు ఈ కిసాన్ అవార్డును కేంద్ర ఆగ్రోఫారెస్ట్రీ పరిశోధన సంస్థ అందజేశారు. మాజీ సైనికుడు సంజయ్ జెన్నా గురండిలో రఘురాం పేరిట ఆగ్రోఫార్మ్‌ను కూడా ఏర్పాటు చేసి అటవీ అధికారులు, వ్యవశాయ అధికారులను ఆకర్షించడంతో వారు ఆయన పేరును కేంద్ర ఐకార్‌కు సిఫార్సు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ డాక్టర్ గురుబచన్ సింగ్, ఐకార్ అదనపు డైరెక్టర్ జనరల్ ఎ.వేల్‌మురుగన్, మాజీ డైరెక్టర్ డాక్టర్ పి.పి.చదుర్వేది, మాజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ధ్యానీ, తదితరులు పాల్గొన్నారు.


కిసాన్ అవార్డును అందుకుంటున్న రైతు సంజయ్ జెన్నా

చందనయాత్రలో చక్ర నారాయణుడు

నరేంద్ర సరోవరంలో సంధ్య వేళలో చందన యాత్ర చలచల్లగా సాగుతోంది. స్వామివారు నిత్యం భక్తులకు రోజుకో పవిత్ర అవతారమూర్తిగా దర్శనభాగ్యం కల్పిస్తున్నారు. సరోవరం పూజా మండపంపై మదన మోహనుడు చక్ర నారాయణుని శోభతో కనులవిందు కలిగించారు. – భువనేశ్వర్



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం


నుజ్జునుజ్జు అయిన బైకులు


గోవింద హుయిక మృతదేహం


సంఘటన స్థలం వద్ద దీపక్ మహారాణ మృతదేహం


దీపక్ మహారాణ (ఫైల్)

రాయగడ: జిల్లాలో ఒక మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. కల్యాణ సింగుపూర్ నుంచి వస్తున్న దీపక్, బి.సాయిలు రివాల్‌కొన గ్రామానికి సమీపంలోని ఉన్న మలుపు వద్ద ఎదురుగా మరో బైకుపై వస్తున్న గోవింద హుయికలు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో దీపక్ కుమార్ మహారాణ(23), కొలనార సమితి కొంటిగుడకు చెందిన గోవింద హుయిక (20)లు చనిపోయాగా.. మండుపాల బిసాయికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పర్లాకిమిడిలో భానుడి భగభగలు

పర్లాకిమిడి: జిల్లాలో ఐదు రోజులుగా భానుడి భగభగలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ వేడిమి అధికంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 38 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో డీహైడ్రేషన్‌కు గురవుతున్నారు. మరో ఐదు రోజుల పాటు వడగాలులు వీస్తాయని ఐఎండీ. అధికారులు చెబుతున్నారు.

రక్తదానం.. ప్రాణదానం


రక్తదానం చేస్తున్న యువకులు

జయపురం: ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితి అసనలో గల ప్రాథమిక వైద్య కేంద్రంలో శుక్రవారం రక్త దాన శిబిరం నిర్వహించారు. కొరాపుట్ రక్తదాతల మోటివేటెడ్ అసోసియేషన్, సంబాదొ అమొ ఒడిశా సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో 33 యూనిట్ల రక్తం సేకరించారు. జయపురం జిల్లా కేంద్ర హాస్పిటల్ రక్త బండార్ టెక్నీషియన్‌లు దాతల నుండి రక్తాన్ని సేకరించారు. కొరాపుట్ జిల్లా రక్త దాతల ఫోరం అధ్యక్షుడు సంజీవ కుమార్, అసోసియేషన్ కోశాధికారి సహేదా పరవాన్, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణదాస్ మహాపాత్రోకు మరో నోటీసు

భువనేశ్వర్ : పశ్చిమ బెంగాల్ దిఘా ప్రాంతంలో జగన్నాథ ఆలయం ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం వివాదానికి సంబంధించి దైతపతి సేవకుడు రామకృష్ణ దాస్ మహాపాత్రోకు శ్రీ మందిరం ప్రధాన నిర్వాహకుడు (సీఏఓ) డాక్టర్ అరవింద్‌కుమార్ పాఢి మరో నోటీసు జారీ చేశారు. రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని గడువు విధించారు. దిఘాలోని జగన్నాథ ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా 'జగన్నాథ్ ధామ్– దిఘా' అనే పేరును ఉపయోగించారని, దీనికి సంబంధించిన సైన్ బోర్డును ప్రదర్శించారని నోటీసులో పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి మాతృ దినోత్సవం రద్దు

భువనేశ్వర్: దేశంలోని ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఈ నెల 11న జరగాల్సిన రాష్ట్ర స్థాయి మాతృ దినోత్సవాన్ని రద్దు చేసినట్లు రాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ ప్రకటించింది. ఈ సందర్భంగా ఎంపిక చేయబడిన ఉత్తమ, అత్యంత హత్తుకునే సెల్ఫీలు, సందేశాల విజేతలకు త్వరలో జరగనున్న సుభద్ర కార్యక్రమం వేదికపై బహుమతులు అందజేయబడతాయని ఆ విభాగం స్పష్టం చేసింది.

సమస్యలతో దేశం కొట్టుమిట్టాడుతోంది



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: భారత్ ప్రస్తుతం విపత్కర సమస్యలతో కొట్టు మిట్టాడుతోందని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ సాధారణ కార్యదర్శి తిరుమల్లయ్ రమణ(తమిళనాడు) అన్నారు. ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ఒడిశా యూనిట్ 13వ రాష్ట్ర సమావేశం బుధ, గురువారం కొరాపుట్ పట్టణం టౌన్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కొరాపుట్ జిల్లా ఆదివాసీ సంస్కృతులు ఉట్టిపడేలా అఖిల భారత యువజన సంఘం ర్యాలీ నిర్వహించారు. పలు ఆదివాసీ కళాకారులు తమ సాంప్రదాయ నృత్యాలతో అతిథులను ఆహ్వానించారు. అనంతరం టౌన్ హాలులో ఏర్పాటు చేసిన సాహిద్ లక్ష్మణ నాయిక్ వేదికపై జమ్మూ కశ్మీర్‌లోని పెహల్గాంలో ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండించారు. మరణించిన పర్యాటకులకు ప్రగాఢ సంతాపం తెలుపుతూ రెండు నిమిషాల మౌనం పాటించారు. సమావేశంలో యూత్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రదీప్ శెట్టి, కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి, యువజన నేత కుమార్‌జాని తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు వితరణ

కొరాపుట్: దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాల వితరణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోనిలో మండయ్ మైదానం పక్కనే ఉన్న డాల్ఫిన్ రిసార్టులో నబరంగ్‌పూర్ ఎంఎల్ఏ గౌరీ శంకర్ మఝి రిబ్బన్ కత్తిరించి శిబిరాన్ని ప్రారంభించారు. ప్రమాదాలలో కాలు, చేతులు కోల్పోయిన వారికి వీటిని అమరుస్తున్నారు. రాజస్థాన్ నుంచి వచ్చిన వైద్య నిపుణులు దివ్యాంగులు కోల్పోయిన అవయవాల నమూనా ప్రకారం వాటిని అమరుస్తున్నారు. ఈ అవయవాల ఖర్చు ప్రభుత్వం భరిస్తుండగా, కార్యక్రమ నిర్వహణ, దివ్యాంగుల రవాణా, భోజనాలు, వసతిని మార్వాడి యువ మంచ్ ఉచితంగా ఏర్పాటు చేసింది. మూడు రోజులు జరిగే ఈ కార్యక్రమంలో తొలి రోజు 83 మందికి అవయవాలు అమర్చారు. ముందస్తు సమాచారం లేకుండా ఎవరైనా ఈ మూడు రోజులలో శిబిరం వద్దకు వస్తే వారికి కూడా అవయవాలు అందిస్తామని నిర్వాహకులు ప్రకటించారు.


కృత్రిమ అవయవాల గురించి ఆరా తీస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మఝి


రాజస్థాన్ నుంచి తీసుకొచ్చిన కృత్రిమ అవయవాలు

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ హాల్‌టికెట్ల పంపిణీ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు కళాశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. ఐపీఈ మార్చి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులతోపాటు వివిధ సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు బెటర్‌మెంట్ రాసుకునేందుకు ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 56 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఫస్టియర్‌కు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు సెకెండియర్ విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. బీఐఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్ నుంచి కూడా విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు సూచిస్తున్నారు.

ఏపీఎస్‌పీ కమాండెంట్‌గా పద్మనాభరాజు


పద్మనాభరాజు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో ప్రారంభించిన 1వ ఏపీఎస్‌పీ (ఐఆర్) నూతన కమాండెంట్‌గా పద్మనాభరాజును నియమిస్తూ పోలీస్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు నిర్వహణ, తీవ్రవాద నిర్మూలన, అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్ట వంటి చర్యల్లో సివిల్ పోలీసులకు సహాయం చేయటం, సలహాలు ఇచ్చేందుకు ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఎచ్చెర్ల ప్రాంతంలో బెటాలియన్ నిర్మాణం ఏర్పాట్లు సైతం పర్యవేక్షిస్తున్నారు. అడిషనల్ కమాండెంటెంట్ పి.సత్తిబాబు, అధికారులు అభినందనలు తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ 21వ బ్యాచ్‌కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈ నెల 3వ వారంలో ప్రారంభమయ్యే శిక్షణకు 16 మందికే అవకాశం ఉందని, పూర్తి వివరాలకు 9441161051, 9390886033 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అనుమానితులతో జాగ్రత్త


మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ సీఐ ప్రసాదరావు

గార : సముద్రం, తీర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానితులు సంచరిస్తే వెంటనే సమాచారమివ్వాలని కళింగపట్నం మెరైన్ సీఐ బి.ప్రసాదరావు కోరారు. శుక్రవారం గార మండలం బందరువానిపేట, కె.మత్స్యలేశం గ్రామాల్లో భారత్–పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో మత్స్యకారులకు అవగాహన కల్పించారు. సముద్రంలో వేట సాగిస్తున్నప్పుడు వేరే దేశాల బోట్లు వస్తుంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజాభద్రతకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై మహాలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

కాశీబుగ్గ: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలకు ప్రాధాన్యమిచ్చి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో పోలీసు గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. విచారణ చేపట్టి పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యాయం చేయండి

- ప్రభుత్వానికి రైతు వేడుకోలు

సంతబొమ్మాళి: తన భూమిలో పోర్టు యాజమాన్యం రెవెన్యూ, పోలీసు అధికారుల సాయంతో దౌర్జన్యంగా రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటోందని కూర్మనాథపురం గ్రామానికి చెందిన రైతు కోట రామ్మూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరుతో తన గోడును వెళ్లబుచ్చాడు. పోర్టు రైల్వేలైన్ కోసం తన 58 సెంట్ల మెట్టు భూమిని ఇవ్వలేదన్నారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో సెంటు రూ.1.50 లక్షలు ఉండగా, ప్రభుత్వం కేవలం రూ.25 వేల పరిహారం మాత్రమే ఇస్తోందన్నారు. తనది మెట్టుభూమి అయితే పల్లపు భూమి అని నమోదు చేశారని మండిపడ్డాడు. దీంతో పరిహారం సరిపోదని జిల్లా కలెక్టర్, టెక్కలి ఆర్డీవో, తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చానన్నారు. అయితే మూడు నెలలు కావస్తున్నా న్యాయం జరగకపోవడంతో హైకోర్టును ఆశ్రయించానని దీనిపై కేసు నడుస్తోందని పేర్కొన్నారు. ఇప్పుడు హైకోర్టులో కేసు ఉండగా పోర్టు యాజమాన్యం రైల్వేలైన్ కోసం చదును చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. విలువైన జీడి, మామిడి ఇతర మొక్కలను కూల్చివేసి రోడ్డు వేశారని మండిపడ్డారు. దీనిని తాను అడ్డుకుంటే దౌర్జన్యంగా పోలీసుస్టేషన్‌లో పెట్టారన్నారు. తనకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

సరస్వతీ పుష్కరాలపై నీలినీడలు!

- ఉత్తరాఖండ్‌లో మే 15 నుంచి ప్రారంభం కానున్న పుష్కరాలు
- భారత్–పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో భయాందోళనలో భక్తులు
- ఇప్పటికే తరలివెళ్లి బిక్కుబిక్కుమంటున్న కొరాపుట్ జిల్లాల ప్రయాణికులు


ఉత్తరాఖండ్ రాష్ట్రం హరిద్వార్‌లో కొరాపుట్ జిల్లాకు చెందిన తెలుగు ప్రజలు

కొరాపుట్: భారత్–పాక్ మధ్య ఉద్రిక్తత వాతావరణం ప్రభావం సరస్వతీ పుష్కరాలపై పడింది. రోజురోజుకూ దాడులు పెరుగుతున్న నేపథ్యంలో పుష్కరాల నిర్వహణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. సరస్వతి నది పుష్కరాలు మే 15 నుంచి 26వ తేదీ వరకు జరగాల్సి ఉంది. సరస్వతి నది ఉత్తర్‌ఖాండ్ రాష్ట్రంలో బద్రీనాద్ థామ్‌కు సమీపంలో మన అనే గ్రామంలో కనిపించి కొంత దూరంలో అంతర్లీనంగా భూమిలోనికి వెళ్లిపోతుంది. మరలా ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగంలో అంతర్వాహినిగా గుర్తిస్తారు. ఈ మన గ్రామాన్ని దేశంలో చివరి గ్రామంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దీని తర్వాత టిబెట్ వస్తుంది. ప్రయాగ్‌రాజ్ గానీ, మన గ్రామానికి గానీ పర్యాటకు వెళ్తుంటారు. పనిలోపనిగా హిమాలయాలలో 6 నెలలు మాత్రమే తెరిచే ఉండే బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యయునోత్రిలను దర్శించుకుంటారు.

విపరీతమైన రద్దీ..

ఎక్కువగా తెలుగు ప్రజలు మాత్రమే వెళ్లే ఈ పుష్కరాలలో విపరీతమైన రద్దీ ఏర్పడుతుంది. ఇప్పటికే దేశంలో అనేక ట్రావెల్ ఏజెన్సీల నిర్వాహకులు భారీ ప్యాకేజీలతో లక్షలాది మంది చేత టిక్కెట్లు కొనిపించారు. ఇప్పటికే వేలాది మంది హిమాలయాలకు చేరుకున్నారు.

యుద్ధ భయం..

ప్రస్తుతం ఎక్కడ చూసినా యుద్ధ భయమే కనిపిస్తోంది. ఇప్పటికే దాదాపు 10 రాష్ట్రాలను కేంద్రం అలర్ట్ చేసింది. వందల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ పుష్కరాలు కోసం వెళ్లి వచ్చేవారు అత్యధికంగా న్యూఢిల్లీ మీదుగా విమాన ప్రయాణాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో కూడా యుద్ధ భయం ఏర్పడింది. విమాన సర్వీసులు రద్దయితే చిక్కుకుంటామని భయపడుతున్నారు. యుద్ధ ఆంక్షలు పెరిగితే తిరిగి ఇంటికి ఎలా రావాలో తెలియక తెలుగు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భయం.. అభయం..

ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఎక్కువ మంది తమ బద్రీనాథ్ ప్రయాణాలు రద్దు చేసుకుంటున్నారు. ఇప్పటికే హరిద్వార్ దాటిన వారు మాత్రం ఏం జరిగితే అదే జరుగుతుందంటూ ముందుకు వెళ్తున్నారు. మరో వైపు ట్రావెల్ ఆపరేటర్లు మాత్రం ప్రయాణికులకు గట్టి భరోసా ఇస్తున్నారు. యుద్ధ ప్రభావం ఉత్తరాఖండ్‌పై పడదని నచ్చజెప్పుతున్నారు. ప్రతి ఒక్కరిని తాము ఇంటికి భద్రంగా చేరుస్తామని ధైర్యం ఇస్తున్నారు.

అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో..

అవిభక్త కొరాపుట్ జిల్లాలైన కొరాపుట్, రాయగడ, నబరంగ్‌పూర్, మల్కన్‌గిరి నుంచి సుమారు 10 వేల మంది సరస్వతి పుష్కరాల ప్రయాణాలు పెట్టుకున్నారు. ఇప్పటికే వందలాది మంది హరిద్వార్ దాటి హిమాలయాల దరికి చేరుకున్నారు. మిగిలిన వారు సందిగ్ధంలో పడ్డారు.

అట్టడుగు వర్గాలకు సౌకర్యాలు


వర్క్‌షాప్‌లో పాల్గొన్న సీఎం మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్: రాష్ట్రావతరణ శతాబ్ది 2036 నాటికి సుసంపన్న ఒడిశా ఆవిష్కరణ లక్ష్యం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని, అట్టడుగున ఉన్న ప్రజలకు అన్ని ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తెలిపారు. ఒడిశాను 500 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. దీని కోసం 36 కార్యక్రమాలు సిద్ధం చేశామని చెప్పారు. స్థానిక లోక్ సేవా భవన్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం విజన్ ఒడిశా 2036, 2047 రూపకల్పనపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నర కోట్ల ఒడియా ప్రజల కలలకు రోడ్ మ్యాప్ లాంటి దార్శనిక పత్రం ఆవిష్కరణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. నిపుణులను సంప్రదించిన తర్వాత తుదిపత్రం ఖరారు చేయనున్నామని చెప్పారు. త్వరలో సంబల్‌పూర్, బాలాసోర్, జయపురం ప్రాంతాల్లో మరో మూడు ప్రాంతీయ వర్క్‌షాప్‌లు జరుగుతాయని సీఎం ప్రకటించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా, హస్తకళల మంత్రి ప్రదీప్ బొలా సామంత, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి సంపద చంద్ర స్వంయి, ఏకామ్ర నియోజకవర్గ ఎమ్మెల్యే బాబూ సింగ్, నగర మేయర్ సులోచన దాస్, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, అభివృద్ధి కమిషనర్ అను గార్గ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సవం


విజయోత్సవంలో మాట్లాడుతున్న నరేంద్ర మహంతి


వేడుకలు జరుపుకొంటున్న కాంగ్రెస్ నాయకులు


బాణసంచా కాల్చుతున్న సుకాంత పట్నాయిక్ తదితరులు

జయపురం: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఉగ్రవాదులను భారత సైన్యం తుదముట్టిస్తుండటాన్ని స్వాగతిస్తూ జయపురం కాంగ్రెస్ శ్రేణులు శుక్రవారం సంబరాలు జరపుకొన్నారు. భారత సైనికులకు, భారతమాతకు జేజేలు పలికారు. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సుకాంత పట్నాయిక్, నిహారంజన్ మహంతి, గంగాధర సాహు, లక్ష్మీనారాయణ పటాన్నయిక్, విశ్వజిత్ దండసేన, ఎ.సురేష్‌కుమార్ సస్మిత రథ్ తదితరులు పాల్గొన్నారు.



జోడు పిక్క

సాధారణంగా జీడిపండుకు ఒక పిక్క మాత్రమే ఉంటుంది. అయితే ఎచ్చెర్ల మండలం చిన రావుపల్లిలోని బొడ్డేపల్లి గణేష్‌కు చెందిన జీడితోటలో మాత్రం ఒక జీడిపండుకు రెండు పిక్కలు కనిపించాయి. ఈ విషయమై వ్యవసాయాధికారి సురేష్ మాట్లాడుతూ జన్యుపరంగా రెండు పిక్కలు కాసే అవకాశం ఉందని చెప్పారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

కోచింగ్ సెంటర్‌లో దారుణం

- విద్యార్థిని చితకబాదిన నిర్వాహకులు
- తండ్రి ఫిర్యాదుతో వెలుగులోకి వ్యవహారం


కోచింగ్ సెంటర్ వద్ద వివరాలు నమోదు చేస్తున్న ఏఎస్‌ఐ సింహాచలం

నరసన్నపేట: స్థానిక ప్రశాంత్ నగర్‌లో కుందనా నవోదయ కోచింగ్ కేంద్రం నిర్వాహకులు విద్యార్థులను చితకబాదుతున్న వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పిల్లలను మంచిగా చదివిస్తామని నవోదయ ఎంట్రన్స్ పరీక్షలకు సిద్ధం చేస్తామని తల్లిదండ్రులను నమ్మించి జాయిన్ చేసుకున్నారు. తీరా అక్కడ విద్యార్థులను ఇష్టం వచ్చినట్లు కొడుతుండడంతో తల్లిదండ్రులు వీధికెక్కారు. దీంతో వ్యవహారం అంతా బయటకు వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పోలాకి మండలం ఈదులవలస గ్రామానికి చెందిన ముద్దాడ శ్రీనివాసరావు తన కుమారుడు శ్రీకర్‌ను కోచింగ్ కోసం కుందనా నవోదయ కోచింగ్ సెంటర్‌లో చేర్పించారు. అయితే గురువారం అబ్బాయి ఇంటికి వచ్చాక స్నానం చేయిస్తున్నప్పుడు వీపు, చెవులుపై గాయాలు ఉండడాన్ని తల్లిదండ్రులు గుర్తించారు. దీంతో విద్యార్థిని ప్రశ్నించగా కోచింగ్ సెంటర్‌లో టీచర్ కొట్టారని, చాలా అవమానకరంగా మాట్లాడారని తెలిపాడు.

పోలీసుల హెచ్చరిక

ఈ విషయంపై విద్యార్థి తండ్రి శ్రీనివాసరావు కోచింగ్ సెంటర్ నిర్వాహకులను ప్రశ్నించగా అతడినే కొడతామని వారు సమాధానం చెప్పారు. దీంతో విషయాన్ని శుక్రవారం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏఎస్‌ఐ సింహాచలం కోచింగ్ కేంద్రం వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఇలా కొట్టడం మంచిది కాదని హెచ్చరించారు. సమాచారం తెలుసుకున్న ఏబీవీపీ ప్రతినిధి మదన్‌కుమార్ కోచింగ్ సెంటర్ వద్దకు వచ్చి నిర్వాహకులను నిలదీశారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. బాలల హక్కులను కాలరాస్తున్న ఈ కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలబాలికలకు రోజుకు 10 గంటలకు పైగా శిక్షణనిస్తున్నారని తెలిపారు. అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఘటనపై కోచింగ్ కేంద్రం నిర్వాహకుడు వైకుంఠరావు మాట్లాడుతూ.. అనుకోకుండా గట్టిగా దెబ్బ తగిలిందని, అంతేతప్ప కావాలని పిల్లలను ఇబ్బంది పెట్టలేదన్నారు.

సెల్‌ఫోన్ చోరీకి యత్నం

టెక్కలి రూరల్: స్థానిక రెడ్‌క్రాస్ వీధి సమీపంలో శుక్రవారం ఒక ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని ఇద్దరు యువకులు వచ్చి ఒక్కసారిగా కింద పడిపోయినట్లు నటించారు. అక్కడే ఉన్న పండిత శ్రీను అనే వ్యక్తి వారిని పైకి లేపేందుకు ప్రయత్నిస్తుండగా ఆ ద్విచక్ర వాహనం వెనుకనున్న వ్యక్తి అతని షర్ట్‌జేబు నుంచి సెల్‌ఫోన్ చోరీకి ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన శ్రీను వారి చేతి నుంచి సెల్ తీసుకున్నాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై అక్కడ నుంచి పరారయ్యారు. ఇది గుర్తించి మరో వ్యక్తి వారిని వెంబడించాడు. స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ వద్ద ట్రాఫిక్‌లో వారిని పట్టుకునే ప్రయత్నం చేయడంతో ఆ ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనం అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దుండగులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే ఈ తరహాలో అనేకసార్లు చోరీలు జరగడంతో ఆ చోరీలతో ఈ యువకులకు సంబంధంపై పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

వాహనదారులను దోచుకుంటున్న ఇద్దరు అరెస్టు


సంజయ సున


హృదానంద నాయక్

జయపురం: రహదారులపై మోటారు వాహనాలను అడ్డుకొని డబ్బు లూటీ చేస్తున్న ఆరోపణలపై ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి సచీంద్ర ప్రధాన్ శుక్రవారం వెల్లడించారు. అరెస్టు అయినవారు జయపురం సమితి ఉమ్మిరి గ్రామం హృదానంద నాయక్ ఉరఫ్ ప్రిన్స్, అదే గ్రామానికి చెందిన సంజయ సున అని వెల్లడించారు. ఇరువురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు వెల్లడించారు. ఈ నెల 7వ తేదీ రాత్రి సబ్ ఇన్‌స్పెక్టర్ సులోచన ప్రధాన్, ఏఎస్‌ఐ పంకజినీ శబరలు పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ చేపట్టారు. అంబాగుడ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో కేవిడి రోడ్డులో దోపిడీ దొంగలు వాహనాలను అడ్డుకొని ప్రయాణికులకు తుపాకీ చూపి డబ్బులు దోచుకుంటున్నారని సమాచారం అందింది. వెంటనే పెట్రోలింగ్ టీమ్ ఘటనా ప్రాంతానికి వెళ్లారు. కెవిడి కోళ్ల ఫారం వద్ద ఇద్దరు యువకులు నిల్చొని ఉన్నారు. పోలీసులను చూసి వారు పరుగుతీశారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారిని తనిఖీ చేయగా తూటాలు లేని పిస్టల్, కొంత నగదు కనిపించాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసు అధికారి వెల్లడించారు.

విద్యార్థులకు అభినందన


ప్రజ్యోతి, అంకితా పాడీని సత్కరిస్తున్న రామరాజు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు


విజయ రహస్యాన్ని వివరిస్తున్న ఫస్ట్ ర్యాంకర్ ప్రజ్యోతి చౌదరి

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో పదో తరగతి బోర్డు పరీక్షల్లో సరస్వతి శిశు విద్యామందిర్ రెండు ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినులు ప్రజ్యోతి చౌదరి (566/600), అంకితా పాడీ (553/600)ను ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా పాతపట్నానికి చెందిన రామరాజు చారిటబుల్ ట్రస్టు శుక్రవారం ఉదయం సత్కరించారు. ఈ సత్కార సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన పారిశెల్లి రామరాజు మాట్లాడుతూ, వచ్చే ఏడాది సరస్వతి శిశు విద్యామందిర్ విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా ఎక్కువ మంది ఫస్ట్ ర్యాంకులు సాధించి పర్లాకిమిడి ఖ్యాతి పెంచాలని కోరారు. ముఖ్యవక్తగా ప్రధాన ఆచార్యులు సరోజ్ పండా, పాతపట్నం ప్రభుత్వ పాఠశాల ఒడియా ఉపాధ్యాయులు భీమ్ సేన్ పండా, విశ్రాంత ఉపాధ్యాయులు గేదెల సుదర్శనరావు, ప్రమోద్ కుమార్ పాడీలు అతిథులుగా విచ్చేశారు. ఉత్తమ విద్యార్థులకు మెమోంటో, వెయ్యి రూపాయల నగదు బహుమతి అందించారు. తల్లిదండ్రులను, ప్రధాన ఆచార్యులు సరోజ్ పండాను పి.రామరాజు సత్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గురుజీ, తదితరులు పాల్గొన్నారు.

అడవులను రక్షించండి


ఖంబగావ్ సెక్షన్ అటవీ ప్రాంతంలో కరపత్రాలు అందజేస్తున్న అధికారులు


మహేంద్రగిరి రేంజ్ పరిధి నారాయణ పూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి అటవీ డివిజన్ పరిధిలో ఏడు అటవీ రేంజ్ అధికారులు గిరిజన ప్రాంతాల్లో అడవులను రక్షించాలని, ప్రచండ ఎండలకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కరపత్రాలను పంచిపెట్టారు. అడవులను తగలబెట్టడం వల్ల వన్యప్రాణులు మరణించడమే కాకుండా పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందని డీఎఫ్ఓ కె.నాగరాజు అన్నారు. దేవగిరి రేంజ్ (పర్లాకిమిడి), మహేంద్రగిరి రేంజ్ (నారాయణపూర్), రామగిరి, ఆర్.ఉదయగిరి, మోహనా రేంజ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కలిమెల బంద్ ప్రశాంతం


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


సమితి కార్యాలయానికి తాళం వేసి నినాదాలు చేస్తున్న దృశ్యం

మల్కనగిరి: జిల్లాలో కలిమెల సమితి బీడీఓ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ సర్పంచ్‌లు, సమితి సభ్యులు శుక్రవారం 12 గంటల బంద్ పాటించారు. సమితి బీడీఓ ప్రదీప్‌కుమార్ కర్‌ను తక్షణమే బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాప్రతినిధులు భారీ ర్యాలీ నిర్వహించారు. సమితి పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి బీడీఓ ప్రజా ప్రతినిధులైన జెడ్పీ సభ్యులు, సర్పంచులు, సమితి సభ్యులకు ఎటువంటి ముందస్తు సమాచారాన్ని ఇవ్వకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం సమితి కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు సుభాషిణి సోడి, బీజేడీ సీనియర్ నాయకుడు ప్రదీప్ మాఝి, మాజీ ఎమ్మెల్యే మానస్ మాడ్కామీ, సమితి మాజీ చైర్మన్ ద్వారక మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

'మత్తు'ను చిత్తు చేద్దాం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డితో కలిసి శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, వర్కర్లు, ఆటో డ్రైవర్లను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల సరఫరా జరుగుతున్నట్లు తెలిసిందని, డ్రగ్స్ విక్రయాలు జరిగే ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బాధితులకు కౌన్సిలింగ్, పునరావాసం కల్పించాలన్నారు. స్కూళ్లు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మెడికల్ షాపులన్నింటిలోనూ సీసీ కెమెరాలు అమర్చాలని ఆదేశించారు. ఎస్పీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈగల్ టీంలు మాదకద్రవ్యాల నిరోధంపై ప్రత్యేక నిఘా పెట్టాయని చెప్పారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే 112, 1972 నంబర్లకు తెలియజేయాలని కోరారు. రిమ్స్‌లోని డీ–అడిక్షన్ సెంటర్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

క్లుప్తంగా

స్వప్న హైందవికి మాతృదేవోభవ పురస్కారం


డాక్టర్ పి.స్వప్న హైందవి

విజయనగరం టౌన్: శ్రీశ్రీ కళావేదిక సాహితీ పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా పలు రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఈ నెల 10, 11 తేదీల్లో ఏలూరులోని మహాలక్ష్మి గోపాలస్వామి కల్యాణ మంటపంలో నిర్వహించనున్న కార్యక్రమంలో పురస్కారాలను అందజేయనున్నారు. ఈ మేరకు జిల్లాకు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, సేవాతత్పరురాలు రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవికి మాతృదేవోభవ పురస్కారం అందజేయనున్నట్లు సంస్థ జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఇద్దరు నిందితులపై కేసు నమోదు


స్వాధీనం చేసుకున్న సారా, బైక్‌ను చూపిస్తున్న సీఐ పి.శ్రీనివాసరావు, సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సారాను అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన దాడిలో స్వాధీనం చేసుకున్న సారా, ద్విచక్ర వాహనాన్ని కురుపాంలోని తన కార్యాలయంలో చూపించారు. సారా అక్రమ అమ్మకాలు నిరోధించే కార్యక్రమంలో భాగంగా జియ్యమ్మవలస మండలం చినమేరంగి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో ద్విచక్ర వాహనంపై సారాను అక్రమంగా తరలిస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడగా వారి దగ్గర 80 లీటర్ల సారాతో పాటు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్షల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: సెకెండరీ గ్రేడ్ టీచర్ పరీక్షలు రాసే అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి ఇ.అప్పన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ పరీక్ష ఉత్తీర్ణులై, సెకండరీ గ్రేడ్ టీచర్, స్కూల్ అసిస్టెంట్ పరీక్షకు అర్హులైన స్థానికులైన వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు డిగ్రీ మార్కుల లిస్ట్, కుల, ఆదాయ, స్థానికత తెలిపే ధ్రువీకరణ పత్రాలు, డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులు టెట్ మార్కుల లిస్టు జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటోలు 2, దరఖాస్తులతో జత చేయాలని సూచించారు.

నల్లబెల్లం పట్టివేత

సీతంపేట: మండల కేంద్రంలో ఎస్‌టీఎఫ్ మొబైల్ టీమ్ మురళీధర్, ఎస్సై హనుమాన్ నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం సీతంపేటలో సారాకు వినియోగిస్తున్న నల్లం బెల్లాన్ని పట్టుకున్నారు. స్థానికంగా ఓ గోదాంలో నిల్వ ఉంచిన వందకు పైగా బెల్లం చక్కీలను సీజ్ చేసినట్లు సమాచారం. బెల్లం వ్యాపారిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

జ్వరంతో బాలుడి మృతి

సీతంపేట: మండలంలోని నాయకమ్మగూడ గ్రామానికి చెందిన ఆరిక మోహిత్ (7) అనే బాలుడు జ్వరంతో బాధపడుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతున్న బాలుడికి మందులు వాడినప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో తల్లిదండ్రులు దోనుబాయి పీహెచ్‌సీకి గురువారం తీసుకువెళ్లారు.అక్కడ వైద్యసేవలందించారు. మెరుగైన వైద్యం కోసం వైద్యాధికారి భానుప్రతాప్ స్థానిక ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేయగా ఇక్కడికి తీసుకువచ్చేసరికే మృతిచెందినట్లు సూపరెంటిండెంట్ శ్రీనివాసరావు తెలిపారు.

పుస్తక హుండీకి విశేష స్పందన


పుస్తకాలను స్వీకరిస్తున్న రవుఫ్, దయానంద్‌లు

విజయనగరం టౌన్: జిల్లా గ్రంథాలయ సేవా సంఘం నిర్వహిస్తున్న పుస్తక హుండీ కార్యక్రమానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తోందని సంఘం వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షుడు కె.దయానంద్‌లు తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ దిమిలి అచ్యుతరావు తన ఇంట్లో ఉన్న వివిధ రకాల పుస్తకాలు ఇతరులకు కూడా ఉపయోగపడాలనే ఉద్దేశంతో తమను సంప్రదించగా ఆయన ఇంటికి వెళ్లి పుస్తకాలను స్వీకరించామ న్నారు. పుస్తక హుండీ నిరంతర ప్రక్రియ అని, ఇలా సేకరించిన పుస్తకాలను వివిధ గ్రంథాలయాలు, విద్యార్థులకు అందజేస్తున్నామన్నారు. సెల్ ప్రభావంతో అన్ని వయసుల వారు పుస్తక పఠనానికి దూరమవుతున్న నేపథ్యంలో మళ్లీ పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించి గ్రంథాలయాలవైపు నడిపించేలా సంఘం నిరంతరం కృషిచేస్తుందని చెప్పారు.

నా నాటిక అభివృద్ధి చెందాలి


మాట్లాడుతున్న సినీనటుడు నరసింగరాజు

- దేశం నలుమూలలా గరివిడికి పేరు ప్రఖ్యాతులు
- సినీనటుడు ఆర్.నారాయణమూర్తి

చీపురుపల్లిరూరల్(గరివిడి): అన్ని రంగాల మాదిరిగానే నాటిక రంగానికి కోటా ఉండాలని, నాటిక రంగం మరింతగా అభివృద్ధి చెందాలని సినీనటుడు ఆర్.నారాయణమూర్తి ఆకాంక్షించారు. ఈ మేరకు గరివిడిలోని శ్రీరామ్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ రాష్ట్రాల ఆహ్వానపు నాటిక పోటీల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రంగస్థలం కళాకారులకు అమ్మఒడి అని, రంగస్థలం పుణ్యస్థలమన్నారు. నాటిక రంగం బతకాలని, నాటిక రంగం ఒక జీవం లాంటిదని అభిప్రాయపడ్డారు. కళలు బతికుండాలని, కళలతోనే సమాజం ముడిపడి ఉందన్నారు. గరివిడి ప్రాంతంలో జరుగుతున్న సాంస్కృతిక పునరుజ్జీవం కార్యక్రమంలో ప్రథమంగా కీర్తిశేషులు దుర్గాప్రసాద్ షరాఫ్‌ను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యాసంస్థలతో పాటు ఉక్కు కర్మాగారాలు నెలకొల్పి భారతదేశంలోనే గరివిడికి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారని కొనియాడారు.

గరివిడికి మంచి ఎదుగుదల

1975లో దుర్గాప్రసాద్ షరాఫ్ హయాంలో నాటి సాంస్కృతిక కార్యక్రమాలను 29 ఏళ్ల తరువాత నేడు గరివిడిలో మరోసారి సాంస్కృతిక పునరుజ్జీవం చేస్తామని నడుం బిగించి కార్యక్రమానికి నాంది పలికిన గరివిడి కల్చరల్ అసోసియేషన్ కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన సాంస్కృతిక నాటిక పోటీలు గరివిడి ప్రాంతాన్ని మంచి ఎదుగుదలకు తీసుకువెళ్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గరివిడి పట్టణానికి చెందిన గరివిడి లక్ష్మి (బుర్రకథ) ఉభయ రాష్ట్రాల్లో ఎంతో ప్రాచుర్యం పొందిందని గుర్తు చేశారు. గురజాడ అప్పారావు, ఆదిభట్ల నారాయణదాసు, ద్వారం వెంకటస్వామినాయుడు, ఘంటసాల, సుశీలమ్మ ఇలా ఎంతో మంది కళాకారులను కళామతల్లికి అందించిన విజయనగరం కళల కాణాచి అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన ఓ సినిమాలో సాంగ్ పాడి సందడి చేశారు.


ఆహ్వాన నాటిక పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీనటుడు ఆర్.నారాయణమూర్తి

కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు

మరో ముఖ్యఅతిథి, సినీనటుడు నరసింగరావు మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతంలో మంచి సాంస్కృతిక నాటిక కార్యక్రమాలు జరిగేవని, అలాంటి గత వైభవాన్ని తీసుకువచ్చేందుకు మంచి ఆలోచన చేసి, ఈ సాంస్కృతిక నాటిక కార్యక్రమాన్ని తలపెట్టిన కమిటీ సభ్యులందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామన్నారు. గరివిడి కల్చరల్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వాకాడ గోపి, అధ్యక్షుడు రవిరాజ్, ఉపాధ్యక్షుడు బమ్మిడి కార్తీక్, ప్రధాన కార్యదర్శి కంబాల శివ, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఉప్పు శ్రీను తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆహ్వానపు నాటిక పోటీల కార్యక్రమంలో అతిథులుగా జాలాది విజయ, బలివాడ రమేష్, సినీ ఆర్టిస్ట్ రవితేజ, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జునతో పాటు పలువురు మండలస్థాయి ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


నాటిక పోటీల కార్యక్రమాన్ని తిలకించేందుకు విచ్చేసిన ప్రేక్షకులు


'విముక్తి' నాటిక ప్రదర్శనలో ఓ సన్నివేశం

బళ్ల కృష్ణాపురం కేసు దర్యాప్తు వేగవంతం


మాట్లాడుతున్న సీఐ ఎస్.గోవిందరావు

సీతానగరం: మండలంలోని బళ్ల కృష్ణాపురం గ్రామంలో అనుమానాస్పదంగా మృతి చెందిన బొత్స రమణమ్మ కేసుపై వచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యామని పార్వతీపురం సీఐ గోవిందరావు అన్నారు. మండలంలో ఆదివారం రాత్రి బళ్లకృష్ణాపురం గ్రామానికి చెందిన బొత్స రమణమ్మ(78)ను ఆమె ఇంట్లోని బీరువాలో నగదు, బంగారం చోరీ చేయడానికి హత్యచేసి ఉంటారని అనుమానం ఉందని కుమార్తె లక్ష్మి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సీఐ ఎస్.గోవిందరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనల మేరకు నేరానికి పాల్పడిన వారిని గుర్తించడానికి ఇన్‌చార్జి ఎస్సై నీలకంఠం, బలిజిపేట ఎస్సై సింహాచలంతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని.ఇప్పటికే క్లూస్ టీమ్ సహకారంతో నిందితులను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై ఎల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో హత్యకేసు నిందితుడు


నిందితుడు మురళితో సీఐ నారాయణమూర్తి తదితరులు

శృంగవరపుకోట: మండలంలోని చామలాపల్లి గ్రామంలో సంచలనం రేకెత్తించిన హత్య కేసులో నిందితుడిని ఎస్.కోట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎస్.కోట సీఐ వి.నారాయణమూర్తి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చామలాపల్లిలో ఈనెల 7వ తేదీ సాయంత్రం నడుపూరు మురళి అనే వ్యక్తి గ్రామానికి చెందిన తొత్తడి ప్రసాద్‌పై దాడి చేసి తల నరికేసి హత్యకు వినియోగించిన కత్తి పట్టుకుని పరారయ్యాడన్నారు. నిందితుడి కోసం గాలిస్తుండగా బైక్‌పై విశాఖపట్నం వెళ్తున్నట్టు అందిన సమాచారంతో పోతనాపల్లి వద్ద అదుపులోకి తీసుకుని, హత్యాయుధాన్ని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. తన తమ్ముడు ప్రసాద్‌ను మురళి హత్య చేసినట్లు మృతుడి అన్న బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడు మురళి భార్యకు మృతుడు ప్రసాద్‌కు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో మురళి హత్యకు పాల్పడినట్లు సీఐ చెప్పారు. నిందితుడిని కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

రెచ్చిపోతున్న కబ్జాదారులు


రాజాపులోవ శ్మశానవాటికలో వెలిసిన పాకలు

- రాజాపులోవలో ఆక్రమణల పర్వం
- శ్మశానవాటికనూ వదలని వైనం
- అధికార పార్టీ నాయకుల అండతో రెచ్చిపోతున్న కబ్జాదారులు

భోగాపురం: విశాలమైన జాతీయ రహదారి.. దీనికి తోడు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం.. భూముల విలువ అమాంతంగా పెరగడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు పాకలు వేసి పాగా వేసేస్తున్నారు. చివరికి శ్మశానవాటిక స్థలాన్ని కూడా వదలడం లేదు. అధికార పార్టీ నాయకుల అండదండలు కలిసి రావడంతో ఎవరూ అడ్డులేరంటూ తమ పని ఎంచక్కా చేసుకుపోతున్నారు. మండలంలోని రాజాపులోవ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వానికి సంబంధించి సర్వే నంబర్ – 28లో కొండపోరంబోకు స్థలంలో ఆక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పంచాయతీ పరిధిలో మొత్తం ఆరు కులాలకు సంబంధించిన శ్మశానవాటికలో కూడా ఆక్రమణలు చోటుచేసుకున్నాయి. గట్టుచప్పుడు కాకుండా పాకలు వేసి స్థలాలను తమ అధీనంలో ఉంచుకుంటున్నారు. స్థానిక రెవెన్యూ సిబ్బందికి ఆక్రమణల విషయం తెలిసినప్పటికీ స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొంతమంది అధికార పార్టీ నాయకుల సహకారంతోనే ఆక్రమణలు జరుగుతున్నాయని వారు చెబుతున్నారు. అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ హారిణి వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న హరిజన వీధి ప్రజలు

పాఠశాలనే ఆక్రమించేశారు..

భోగాపురం: మండల కేంద్రంలోని పెద హరిజన వీధిలో ఉన్న ఎంపీయూపీ పాఠశాల ప్రాంగణం ఆక్రమణకు గురైందని, అధికారులు తక్షణమే స్పందించి బాధ్యులను శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల ప్రాంగణం ఆక్రమణపై ఇప్పటికే స్థానిక అధికారులతో పాటు గ్రీవెన్స్‌సెల్‌లో కూడా ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదన్నారు. కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఇళ్లు కట్టుకున్నారని.. అటువంటి అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు మాత నవీన్, బొల్లు త్రినాథ్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యారంగంలో తీవ్ర సంక్షోభం

- ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉద్యమం
- కూటమి ప్రభుత్వంలో పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం
- జిల్లా కేంద్రంలో ఏపీటీఎఫ్ నిరసన



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖ ఒక ప్రయోగశాలగా మారిందని, ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా విఫల ప్రయోగాలు చేపడుతోందని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి. ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు అశాస్త్రీయమైన తొమ్మిది రకాల పాఠశాలలను బలవంతంగా ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తున్నామని ఏపీటీఎఫ్ నాయకులు స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిరసన చేపట్టారు. ప్రతి గ్రామంలో ఒకటి నుంచి ఐదు తరగతులతో కూడిన మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయాలని, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున నియమించాలని, ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 55ప్రకారం ఉన్నత పాఠశాలలో 45 మంది విద్యార్థులు దాటితే మరో సెక్షన్ మంజూరు చేయాలని కోరుతున్నారు. ఆ తరువాత ప్రతి 35 మందికి ఒక్కొక్కరు చొప్పున పాఠశాల సహాయకులను నియమించాలని, పూర్వ ప్రాథమిక విద్యాకేంద్రాలను ప్రాథమిక పాఠశాలలతో అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని, ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో తెలుగు మీడియం తప్పనిసరిగా కొనసాగించాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి పడిన మూడు డీఏలు గత పీఆర్‌సీ ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, నూతన పే రివిజన్ కమిటీని నియమించి కనీసం 30 శాతానికి తగ్గకుండా మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 14న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ ధర్నా శిబిరంలో వివిధ మండలాల ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిల్లా సబ్ కమిటీ సభ్యులు, జిల్లా కౌన్సిలర్లు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలి. మాతృభాషను ఎత్తివేసే ఏ చర్యనైనా ఖండిస్తున్నాం. ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగిస్తున్న చోట నలుగురు స్కూల్ అసిస్టెంట్‌లను వేయాలి. పెరిగిన జనాభాకు అనుగుణంగా నివాసిత ప్రాంతాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఈనెల 14న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– ఎం.మహేష్, ఏపీటీఎఫ్, జిల్లా అధ్యక్షుడు

ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలి



ప్రాథమిక పాఠశాలలైన 1–5 తరగతుల్లో మోడల్ ప్రాథమిక పాఠశాల లేదా బేసిక్ ప్రాథమిక పాఠశాలలుగానే కొనసాగించాలి. ప్రాథమిక పాఠశాలలకు పూర్వ ప్రాథమిక విద్యను అనుసంధానం చేయాలి. గ్రామాల్లో అదనంగా ఫౌండేషన్ పాఠశాలల పేరుతో 1,2తరగతుల కోసం ప్రత్యేక బడిని కొనసాగిస్తున్నామని చెబుతున్నారు. ఇది పూర్తిగా అశాస్త్రీయమైన ధోరణి. ప్రభుత్వం తీసుకున్న ఈనిర్ణయాలను పూర్తిగా ఏపీటీఎఫ్ తరఫున ఖండిస్తున్నాం.

– ఎస్. బాలకృష్ణ, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం



ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. పాఠశాలల పరిరక్షణకు శాస్త్రీయమైన ప్రత్యామ్నాయ ఏర్పాటు జరగలేదు. విద్యార్థులకు నష్టం చేకూరే విద్యా విధానాలను ఈ ప్రభుత్వం ఉంచుతోంది. వాటిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఉద్యమించాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు ఈనెల 14న చలో విజయవాడ కార్యక్రమంలో ఉపాధ్యాయులంతా పాల్గొనాలి.

– ఎస్. ధనలక్ష్మి, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు

భాషాభ్యాసం చాలా కీలకం

డెంకాడ: రాబోయే సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించే ఈ డిజిటల్ యుగంలో భాషాభ్యాసం చాలా కీలకమని వరంగల్ నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్ఫూర్తి అన్నారు. ఈ మేరకు మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఆంగ్లప్రయోగశాల ఆంగ్లభాషాభ్యాసంపై శుక్రవారం వర్క్‌షాప్ జరిగింది. గ్రామీణ విద్యార్థులు భాషాభ్యాసానికి ఎలా అనుగుణంగా ఉంటారో అన్న అంశంపై పరిశోధన ప్రాజెక్టులో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. నిట్ ప్రొఫెసర్ స్ఫూర్తి నాయకత్వంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె విద్యార్థుల్లో భాషాభ్యాస ప్రయాణం, రియల్‌టైమ్ ఇంజినీరింగ్‌లో బీటెక్ సాధనాలు, ఇంటర్నెట్, డిజిటల్ వనరులు ఉపయోగించడంలో ప్రభావాన్ని అంచనా వేయడానికి ఏ విధమైన ఆలోచనలు చేయాలో విద్యార్థులకు వివరించారు. ప్రతి సవాలుకు పరిష్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తమ్మినేని హరిబాబు, వరంగల్ నిట్ బృందం, ప్రాజెక్టు అసోసియేట్ అమృత, అధ్యాపకులు శ్రావణి, రాణి, రేవతి, రాజా, షీబా, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

బలిఘట్టంలో ఎంఎస్‌ఎంఈ పార్కుకు శంకుస్థాపన

- హాజరైన ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కొత్తవలస: కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుని రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు యువ పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల పరిధిలో 175 ఎంఎస్‌ఎంఈ పార్కులను ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో జిల్లాకు మంజూరైన నాలుగు పార్కుల్లో మొట్టమొదటి పార్కుకు ఎస్.కోట మండలంలోని బలిఘట్టం గ్రామం సమీపంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మొదటి విడతగా 50 పార్కులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతూ అందులో విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల, గజపతినగరం, ఎస్.కోట, బొబ్బిలి నియోజకవర్గాలకు మంజూరైనట్లు చెప్పారు. బలిఘట్టం పార్కుకు సుమారు రూ 96 కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని, ప్రత్యక్షంగా 1500 మందికి, పరోక్షంగా 500 మందికి ఉపాధి లభించే పరిస్థితి ఉందన్నారు.

మూసుకున్న కర్మాగారాలను తెరిపించండి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో పలు పరిశ్రమలు మూతపడ్డాయని ముందుగా ఆ పరిశ్రమలను తెరిపించి కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయాలని జిందాల్ కార్మికులు మంత్రికి వినతిపత్రం అంతజేశారు.

మంత్రి రాకకోసం నిరీక్షణ

మంత్రి తీరిగ్గా 11 గంటలకు కార్యక్రమానికి వచ్చారు.అప్పటికే సభకు వచ్చిన మహిళలు, వృద్ధులు తీవ్రమైన ఎండతో అవస్థలు పడ్డారు. 41 డిగ్రీల ఎండలో వేచి ఉన్నప్పటికీ కనీసం వారికి మంచినీళ్లు ఇచ్చే నాథుడు లేకపోవడంతో సభకు వచ్చిన వారు ఉసూరుమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సీలంశెట్టి గోపెమ్మ, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీధర్, సహాయ సంచాలకుడు బి.రామకృష్ణ, ఆర్‌డీఓ దాట్ల కీర్తి, తహసీల్దార్ బి.నీలకంఠరావు, ఎల్.కోట ఎంపీడీఓ సింగంపల్లి అప్పారావు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన


స్వర్ణ పుష్పాల అలంకరణలో పైడితల్లి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, సిరుల తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు శుక్రవారం స్వర్ణ పుష్పార్చనలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు అచ్యుతశర్మ, దూసి శివప్రసాద్ శాస్త్రోక్తంగా అమ్మవారికి స్వర్ణ పుష్పార్చన సేవను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఇంచార్జ్ ఈవో కెఎన్‌విడివి.ప్రసాద్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.